నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శుక్రవారం | 12 జులై 2024 | పేజీలు 9


## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**కుప్పం, మేజర్‌న్యూస్:**

కుప్పం మండల పరిధిలోని జరుగు గ్రామంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టిడిపి కుప్పం ఇంచార్జ్ మునిరత్నం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించినట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ బాబు, కౌన్సిలర్ జాకీర్, పార్టీ విస్తరణ కమిటీ విభాగ సభ్యులు మంజునాథ్, ఆర్గనైజ్ రాహుల్ పాల్గొన్నారు.



### కలెక్టర్, ఎమ్మెల్సీ

## కార్గో ఎయిర్‌పోర్ట్ భూముల పరిశీలన

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రామాపురం కార్గో ఏర్పోర్ట్ భూముల పరిశీలించారు. నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో భాగంగా ఎయిర్‌పోర్ట్ పనులనుత్వరలోనే ప్రారంభించి ఎయిర్‌పోర్ట్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. వారి ఆదేశానుసారం గురువారం మధ్యాహ్నం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పిఎస్ మునిరత్నం, తెలుగు దేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో ఎయిర్పోర్ట్

మిగతా 2లో



## రైతులు వ్యవసాయ యాంత్రిక పద్ధతిని సద్వినియోగం చేసుకోవాలి

**స్ప్రింక్లర్, డ్రిప్ వాడకం ద్వారా తక్కువ నీటి ఖర్చుతో వ్యవసాయం**

**జిల్లాలో పామ్ ఆయిల్‌ను రైతులు సద్వినియోగం చేసుకోండి : జిల్లా కలెక్టర్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

రైతులు వ్యవసాయ యాంత్రిక పద్ధతిని సద్వినియోగం చేసుకోవాలని, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు చేపట్టిన డ్రోన్ పైలట్ ద్వారా పురుగు మందులను పంట పొలాలకు పిచికారి చేసే విధానం ఎంతో ఉపయుక్తంగా ఉందని, స్ప్రింక్లర్, డ్రిప్ వాడకం ద్వారా తక్కువ నీటి ఖర్చుతో వ్యవసాయం తద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని, జిల్లాలో ఆయిల్ పామ్ ఒక వరం అని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలియజేశారు. గురువారం వడమాలపేట మండలం కదిరి మంగలం గ్రామంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం పైలట్ ప్రాజెక్టుగా కదిరిమంగళం గ్రామ పరిధిలో రైతుపొలంలో పురుగు మందులను డ్రోన్ ద్వారా పిచికారి చేసే విధానంపై అవగాహన కల్పించి డ్రోన్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నందున తక్కువ ఖర్చుతో వాటిని రైతులకు అందుబాటులో తెచ్చారు. దీనిపై వారిని కలెక్టర్ అభినందిస్తూ రైతులు వ్యవసాయంలో యాంత్రికరణ పద్ధతులను వినియోగించడం వలన తక్కువ పెట్టుబడితోఎక్కువ రాబడి వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. డ్రోన్ ద్వారా మందులు పిచ్చికారి చేయడానికి ఎకరాకు 10ని. నుండి 15 నిమిషాల లోపు సరిపోతుందని

మిగతా 2లో



## 8 మంది స్మగ్లర్లు అరెస్ట్... 11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీప్రాంతంలో 8మంది స్మగ్లర్లు ను అరెస్ట్ చేసి వారి నుంచి 11 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జి, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో ఆర్ఎస్ఐలు కే.సురేష్ బాబు, వినోద్‌కుమార్ రెడ్డి టీమ్ బుధవారం సానిపాయ రేంజ్ గుండ్రేటివారి పల్లి చేరుకుని అక్కడ నుంచి ఎంట్రీ ఎగ్జిట్ తనిఖీ చేపట్టారు. రాయవరం సెక్షన్ నల్లగుట్ట ప్రాంతం చేరుకోగా, అక్కడ కొంతమంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా కొందరు దుంగలు పడేసి పారిపోయారు. వారిని వెంబడించి 8మంది స్మగ్లర్లు ను పట్టుకున్నారు. పట్టుబడిన స్మగ్లర్లు తమిళనాడు, తిరుపత్తూరు జిల్లా అంబూరు తాలూకాకు చెందిన చక్రవర్తి గోవిందన్ (40), హరికృష్ణన్ శ్రీనివాసన్ (49), గోవిందరాజు మురుగన్(23), వి.శక్తివేల్ (27), తిరుపతి సెల్వం (24), సెల్వం చిన్న కుజహండ (50), సురేష్ (23), అనంతపురం జిల్లా కన్నపల్లికి చెందిన వడ్డే సుబ్రహ్మణ్యం(45)లుగా గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసిన సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.



### మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన

## వైకాపా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

**వి.కోట, మేజర్‌న్యూస్:** పుంగనూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని గురువారం తిరుపతిలోని తన స్వగృహం నందు వైకాపా రాష్ట్ర కార్యదర్శి పి.ఎన్ నాగరాజు, వి.కోట మేజర్‌గ్రామపంచాయతీ సర్పంచ్ పిఎన్.లక్ష్మమ్మ, ప్రముఖ న్యాయవాది పిఎన్.మంజునాథ్ కలిసి పుష్పగుచ్ఛం అందించడం జరిగింది. వై.యస్ఆర్‌పార్టీ స్థితిగతులపై చర్చించడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా వైకాపా నాయకులపై కార్యకర్తలపై జరుగుతున్న దాడులు ఎలా ఎదుర్కోవాలో దానిపై చర్చించడం జరిగిందన్నారు. మాజీ మంత్రి పెద్దరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మేమంతా కార్యకర్తలకు నాయకులకు అండగా ఉంటామని పార్టీకి కష్టపడిన ప్రతి ఒకరికి అండగా ఉంటామని ఏ ఒక్క కార్యకర్త నాయకులు భయపడాల్సిన అవసరం లేదన్నారని రాష్ట్ర కార్యదర్శి పి.ఎన్. నాగరాజు తెలిపారు.



## ఘోర రోడ్డు ప్రమాదం... ముగ్గురు మృతి

**బుచ్చినాయుడు కండ్రిగ, మేజర్‌న్యూస్:**

మండలంలోని పార్లపల్లి పంచాయతీ పరిధిలో గల శ్రీకాళహస్తి- తడ బైపాస్ రోడ్‌లో జరిగిన ప్రమాదంలో ముగ్గురుమృతి చెందారు. ఒడిస్సాకు చెందిన రాజాసింగ్, బాబుసింగ్, శుక్రదేవ్ కెవిపురం మండలం అలత్తూరు గ్రామ పరిధిలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. వీరు బైక్‌పై శ్రీకాళహస్తికి బయలుదేరారు. పార్లపల్లి వద్దకు రాగానే శ్రీకాళహస్తి నుంచి వస్తున్న కారును ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. కారుడ్రైవర్ పరారు కాగా మృతదేహాలను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



## అయ్యప్పస్వామి గుడి నిర్మాణం కోసం భిక్షాటన

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** గూడూరు పట్టణంలోని కాశీ లేఅవుట్‌లో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి గుడి కోసం అయ్యప్ప స్వామి సేవ సమితి ఆధ్వర్యంలో భిక్షాటన నిర్వహించారు. అయ్యప్పస్వామి సేవ సమితి సభ్యులు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి గుడి నిర్మాణం, స్వామివారి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ లో భక్తులు భాగస్వామ్యం చెయ్యాలనే ఉద్దేశ్యంతో ఈ భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈకార్యక్రమంలో అయ్యప్పస్వామి సేవ సమితి సభ్యులు అయ్యప్పస్వామి భక్తులు భారీగా పాల్గొన్నారు.



## రైతులకు పశుగ్రాసం విత్తనాలు పంపిణీ

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని రాళ్ళబూదుగూరు పశువైద్య కేంద్రము నందు గురువారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా చేపట్టిన "పశుగ్రాస వారోత్సవాలు కార్యక్రమములో భాగంగా మొక్కజొన్న పశుగ్రాస విత్తనములను 75 శాతం సబ్సిసిడితో పాడి రైతులకు టిడిపి నేతలు చే పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలను వినియోగించుకుని ఆర్థికంగా ముందు ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం రాళ్ళబూదుగూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్ ను తెలుగు దేశం పార్టీ నేతలు విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి నేతలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మంచిగా చదవాలని వారి కుటుంబాలకి గ్రామానికి దేశానికి మంచి పేరు తెచ్చి పెట్టాలని కోరారు. పాఠశాలకు కావలసిన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని కాబట్టి విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ మనీ, బసవరాజు, జయరాజు, వాజిత్, రామప్ప, పూజా, గోవింద రాజులు, విజయ్, శంకరప్ప, అశోక్, ఆనంద్, శ్రీనివాసులు, ఎంఆర్.నారాయణ, గ్రామ సర్పంచ్ లక్ష్మి మురుగేష్, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు









**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల వేంకటేశ్వరుడిని పలు వురు ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపీ విరామ సమయంలో మాజీ క్రికెటర్ శ్రీశాంత్, తెలంగాణ ఎమ్మెల్యే వెంకటేష్, ఖమ్మం బిఆర్ఎస్ ఎమ్మెల్సీ మధు, ఎంపీ గొల్లబాబు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌లు వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు పట్టువస్త్రంతో సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## రైతు బజార్‌లో కందిపప్పు, బియ్యం విక్రయాలు

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో రైతు బజార్లలో ఒక కేజీ కందిపప్పు 160 రూపాయలు మరియు స్టీమ్ బియ్యం కేజీ 49 రూపాయలు మరియు మరొక రకం కేజీ 48రూపాయల చొప్పున విక్రయించే విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని గూడూరు తాసిల్దార్ గూడూరు తాసిల్దార్ కరుణ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు . గూడూరు పట్టణంలోని రైతు బజార్లో తిరుపతి జిల్లా రైస్ మిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు హెూల్ సేల్ కిరాణామర్చంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాన్ని గూడూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గూడూరు తహసీల్దార్ కరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ భరించి సరసమైన ధరలలో నాణ్యమైన సరుకుల అమ్మకం నినాదంతో రైతు బజార్లలో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ హజ్మతుల్లా ఖాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు పెంచురామయ్య శివకుమార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు వ్యవసాయ యాంత్రిక పద్ధతిని సద్వినియోగం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

డ్రమ్ సీడర్ వినియోగించడం ద్వారా యూనిఫామ్‌గా వరుసగా విత్తనాలను భూమిలో నాటడం జరుగుతుందని, దీనివలన కూలీల ఖర్చు, సమయము ఆదావుతుందని రాబడి పెరుగుతుందని రైతులు అందరూ అంగీకరిస్తే ఒక డ్రోన్ పైలట్ ఏర్పాటుకు సిహెచ్సి గ్రూపుకు సబ్సిడీ ద్వారా లోన్ అందజేయడం జరుగుతుందని తద్వారా గ్రామంలోని రైతులు వాటిని నామ మాత్రపు ధర అద్దెతో వినియోగించుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం కెవికె హెడ్ శ్రీనివాసులు సదర డ్రోన్‌ను ఎగురవేసి రైతు పొలంలో పురు మందును పిచికారి చేసి చూపించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్ రావు వివరిస్తూ వడమాల పేట మండలంలో బిపిటి 3082, కేఎన్ఎం 733 నూతన వరివంగడాలు బిపిటి 5204 సోనా మసూర (వ్యాధులు రావడం వలన ఎక్కువ పురుగు మందులు వాడాల్సి వస్తుంది) కి ప్రత్యామ్నాయంగా సాగు చేయడం ద్వారా ఇవి 130 రోజులలోనే పంట చేతికి అందుతుందని తెలిపారు. రాస్ – కృషి



విజ్ఞాన కేంద్రం ద్వారా 30 మంది డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అధికారులు వివరించారు. అనంతరం కలెక్టర్ రైతుకు గ్రీన్ మ్యాన్యూర్ సీడ్ ను పంపిణీ చేశారు. అనంతరం పాదిరేడు గ్రామ పరిధిలోని ఆయిల్ పామ్ నర్సరీని, అలాగే డ్రిప్ ఇరిగేషన్ పోర్టబుల్ స్ప్రింక్లర్స్, మినీ స్ప్రింక్లర్స్ వాడుతున్న రైతుల పొలాలను పరిశీలించారు. ఉద్యానశాఖ అధికారి వివరిస్తూ జిల్లాలో 151 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగవుతున్నదని, ఈ సంవత్సరానికి 400 హెక్టార్ల లక్ష్యంగా నిర్దేశించారని 147 మొక్కలు 20 నుండి 29 వేల రూపాయల సబ్సిడీతో ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, అంతర పంటలకు సబ్సిడీ రూ.5250 ఇవ్వడం జరుగుతుందని, అలాగే 5250 రూపాయలు ఎరువులకు సబ్సిడీ ప్రతి సంవత్సరం నాలుగు సంవత్సరాలు ఇవ్వడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అంతే కాకుండా కలెక్టర్ వివరిస్తూ తక్కువ నీటితో పొలమంతటికి నీటిని సరఫరా చేయడానికి డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని, వినియోగించుకోవాలని సూచించారు. గ్రామస్తులు స్మశాన వాటికకు స్థలం గురించి కలెక్టర్ కోరగా వారంలోపు స్థలాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని తాశిల్దార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, ఏపీఎంఐపి పిడి సతీష్, తహసీల్దార్ రాజ నర్సింహ, ఎంపీడీవో సుజాత, ఏడిఏలు ధనుంజయ రెడ్డి, రమేష్, విజయ్ కుమార్, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్, ఎమ్మెల్సీ కార్గో ఎయిర్‌పోర్ట్ భూముల పరిశీలన

(మొదటిపేజీ తరువాయి)

భూముల పరిశీలన కోసం అధికార యంత్రాంగం రావడం జరిగింది. వారు వస్తున్నారన్న విషయం తెలు సుకున్న రామాపురం మాదిగలు అక్కడకు చేరుకుని కలెక్టర్, ఎమ్మెల్సీ వారి సమస్యలను తెలియజేస్తూ టైటిల్ సిల్క్ ఫ్యాక్టరీ కోసం కొంతమంది మాదిగల భూములను కొంతమేరకు తీసుకున్నారని వాటికి సంబం ధించిన ఒరిజినల్ పట్టా, పాస్‌పుస్తకాలు తమవద్దె ఉన్నాయన్నారు. అలాగే కార్గో ఎయిర్పోర్ట్‌కు సంబంధించిన విషయంలో కొంతమంది భూములు కూడా కోల్పోవడం జరిగిందని మావద్ద పట్టాదారు పాస్ పుస్తకాలు ఒరిజినల్స్ ఉన్నాయని మాకు న్యాయం చేయాలని కలెక్టర్, ఎమ్మెల్సీల దృష్టికి తీసు కొచ్చారు. స్పందించిన కలెక్టర్ భూమిసాగులో ఉన్నవారికి రికార్డులు పరిశీలించిన మీదట కచ్చితంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కొంతమంది మహిళలు గత 20 రోజులు నుండి మాకు నీటి సమస్య ఉందని నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలపడంతో సాయంత్రంలోపు కమిటీని పంపి రేపటిలోగా నీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కుప్పం జనసేన సమన్వయకర్త డాక్టర్ సురేష్ జనార్దన్ రెడ్డి ఎమ్మార్పీఎస్ నాయకుడు దేవరాజు పాల్గొన్నారు.

# వనరులకు తగ్గ జనాభా అవసరం

### ప్రపంచ జనాభా దినోత్సవ సభలో వక్తలు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** అధిక జనాభా పెరుగుదలతో సరిపడా వనరులు లేక ఆందోళనలో ఏర్పడే ప్రమాదముందని ఈ నేపథ్యంలో వనరులకు తగ్గ జనాభా ఎంత అవసరమని, తద్వారా మనుషులు మనగుడా సుసాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పాపులేషన్ స్టడీస్ సోషల్‌వర్క్ ఎస్వీ యూనివర్సిటీ, సెట్విన్ సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ హాల్లో డిపార్టుమెంట్ ఆఫ్ పాపులేషన స్టడీస్ సోషియల్ వర్కు హెడ్ డాక్టర్ టి.చంద్రశేఖరయ్య, ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మనాభం,యమ్.యస్. డబ్ల్యు (యస్.యస్.సి) డిపార్టుమెంట్ ఆఫ్ పాపులేషన్ స్టడీస్ సోషియల్ వర్కు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.సాయిసుజాత ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జనాభా పెరుగుదల ఆందోళనకరమయిన అంశముగా భావించాలని, నివారించే చర్యలలో భాగంగా వివిధ రంగాలు నుంచి సమాచారాన్ని సేకరించి ప్రణాళికలను అమలు చేసినట్లయితే దేశ అధిక జనాభాను నివారించవచ్చని తెలిపారు. తద్వారా ఆహార సమస్య, నిరుద్యోగ సమస్య, నీటి సమస్య, కాలుష్యము సమస్య నిరోధించ వచ్చునని తెలియజేశారు. నేటి యువత భాధ్యతతో మెలగి జనాభా పెరుగుదల వలన వచ్చే ఆహార సమస్యలు, ఆరోగ్య సమస్యలు, నిరుద్యోగ సమస్యలు, సామాజిక సమస్యలు పట్ల ముందు జాగ్రత్తగా వుండాలన్నారు. చైనా దేశం కన్నా మన దేశంలో అధిక జనాభా ఉండడం గర్వించదగ్గ విషయం కాదని, జనాభాలో అధికం కాకుండా అభివృద్ధిలో ఆధిక్యతలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ప్రపంచ జనాభాలో భారత దేశజనాభా 17.8% వుండడం మన దేశం శరవేగముగా జనాభా పెరుగుదలకు సూచికఅని, సర్వేలు, గణాంగ పద్ధతిలో పరిశీలించినట్లయితే భారత దేశంలో పట్టణంలో కన్నా గ్రామీణ ప్రాంతంలో జనాభా పెరుగుదల వుందని, కేవలం అవగాహన లోపం వలన ఇందుకు కారణము అని, జనాభా తగ్గించే చర్యలో భాగముగా గ్రామీణ ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తేలియజేశారు. డా.వి.మురళీకృష్ణ, మాట్లాడుతూ ప్రపంచ జనాభాతో మన దేశ జనాభా శరవేగంగా పెరుగుతుందని, ఇది ఆందోళన కార అంశమన్నారు. మనదేశ జనాభాలో అత్యధికంగా యువత వుండడం మంచి పరిణమనమని, ఇది దేశ అభివృద్ధికి దోహద పడుతుందని తెలియజేశారు. పద్మావతి డిగ్రీకళాశాల, ఐఎయస్ కళాశాల, క్యాంపస్ స్కూల్, లా కళాశాల, యస్‌వి యునివర్శిటీ విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలు, ప్రశంశా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర యునివర్శిటీ, పాపులేషన్ స్టడీస్, సోషియల్‌వర్కు కార్యాలయ సిబ్బంది, కళాశాల సీనియర్ అధ్యాపకులు సెట్విన్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళలు ఆర్థికంగా ఎదగడమే ముఖ్య ఉద్దేశం

**గుడిపాల. మేజర్‌న్యూస్:** మహిళలు ఆర్థికంగా ఎదగడమే ముఖ్య ఉద్దేశంగా మండల సమైక్యాల ద్వారా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను విరివిగా మంజూరు చేస్తుందని వెలుగు ఏపీఎం సుధారాణి అన్నారు. గురువారం మండలంలోని ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం సుధారాణి అధ్యక్షతన వార్షిక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు తీసు కున్న రుణాలను వాయిదాల రూపంలో సకాలంలో చెల్లిస్తే వడ్డీ లేని రుణాలు పొందవచ్చు అన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాల గురించి ఎప్పటికప్పుడు యానిమేటర్లు సీసీల ద్వారా సమాచారాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం 2023-24వార్షిక ఆదాయ వివరాలను చదివి వినిపించారు. ఈ ఆర్థిక సంవత్స రానికి గాను వెలుగు సమాఖ్య 5లక్షల84 వేల రూపాయలు లాభంలో ఉందని ఆమె తెలిపా రు. మొత్తం మీద చూసుకుంటే 80లక్షల 78వేల లాభంలో ఉందని ఆమె తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన తరహా పరిశ్రమలను కూడా ప్రోత్సహిస్తుందని కావున మండల సమైక్య అభివృద్ధికి ప్రతి ఒక్కరి కృషి అవసరమని ఆమె తెలిపారు. అనంతరం మండల సమైక్య నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సుమతి, ఎంపీటీసీ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సాంబశివ నాయుడు, సీసీలు హేమచంద్ర రెడ్డి, లోకనాథ్ రెడ్డి, ఇతర సంఘ మిత్రలు, పాల్గొన్నారు.



## టీడీపీ కార్యకర్తలకు చేయూత

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** మాకు ఆదర్శం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందులో భాగంగానే బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం నాయకు లు, కార్యకర్తలు చంద్రబాబు సీఎం అయి నందున తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శ నార్థం కాలినడకన పోతున్నారు. వారిని వెంక టగిరి బైపాస్ రోడ్డు గూడూరు నందు కలిసి వారికి కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ సమోసా లు ఇవ్వడం జరిగింది. మాముడూరు హరికృష్ణ గూడూరు గోపాల్ కలిసినవారిలో ఉన్నారు.



## ప్రపంచ జనాభా దినోత్సవ సందర్బంగా అవగాహన

### గంబూసియా చేపలను నీటిలో వదలడం

**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ పూజ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహనా కార్య క్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ పూజ మాట్లాడుతూ 18 సంవత్స రాల లోపలగల బాలికలకు వివాహం చేయడం వల్ల కలిగే నష్టాలు,ఆరోగ్య సమ స్యలు, బిడ్డకు, బిడ్డకు ఎడం పాటించడం వలన కలిగే లాభాలు, తాత్కాలిక గర్భనిరోధక పద్దతులు, మాతా శిశుసంరక్షణ పద్దతులను స్లోగన్స్ ద్వారా ప్రజలలో అవగాహన కల్పించ డం చేశారు. అనంతరం గంబూసియా చేపలను పట్టణంలో గల నీటి నిల్వప్రాంతాలలో వదిలారు. ఈ గంబూసియా చేపల పెంచడం వలన నీటిలో గల దోమల లార్వాలను తినివేసి దోమల పెరుగుదలను కట్టడి చేయవచ్చును. పట్టణంలో బజారు వీధిలో గల కోనేటిలో, నేతాజీ నగర్‌లో గల వ్యవసాయ బావిలో గాంబూసియా చేపలను వదలడం జరిగింది. ఈ కార్మక్రమంలో సూపర్‌వైజర్ యస్.బహుద్దీన్, పి.జమున, యం.యల్.హెచ్.పి, ఏ.ఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



## బోలేరో బోల్తా నేలపాలైన టమాటా

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని ఆమినిగుంట సమీపంలో గురువారం ఉదయం టమాటా బాక్సులతో వెళ్తున్న బోలేరో వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. హనుమంత రెడ్డికి చెందిన టమాటాలను బాక్సులలో వేసుకొని పలమనేరు టమాట మార్కెటుకు తరలిస్తుండగా బోలేరో వాహ నం వీల్ విరగడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో సుమారు 150బాక్సుల టమాటాలు నేలపాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. నేలపాలైన టమాటాలను బాగున్న వాటిని మార్కెటుకు తరలించారు.



## ఎస్సీ, ఎస్టీ కేసువిచారణ నిమిత్తం డీఎస్పీ పర్యటన

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** పట్టణానికి చెందిన రామ్మూర్తి పిర్యాదు మేరకు యస్సి,యస్టి విచారణ నిమిత్తం గురువారం పలమనేరు డియస్పి రఘువీర్ చౌడేపల్లి కి వచ్చారు.యస్సి,యస్టి కేసు కు సంబందించిన విచారణ తర్వాత చౌడేపల్లి పోలీస్టేషన్ ను సందర్శించి,పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది కి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు రూలర్ సర్కిల్ ఇన్పెక్టర్ కృష్ణారెడ్డి, ఎస్సై ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# ఉచిత కంటి వైద్య శిబిరం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** డా.అగర్వాల్ కంటి ఆసుపత్రి డా.యుగంధర్ చర్మ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్‌లో ఉద్యోగు లకు, విద్యార్థులకు కంటి, చర్మ సంబంధిత వ్యాధులుపై ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం వైస్- ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి ప్రతి ఒక్కరు కూడా ఆరోగ్యంగా ఉన్నప్పుడే వారి విధులను చక్కగా చేయగలరని, అందువల్ల విశ్వవిద్యా లయం ఉద్యోగుల, విద్యార్థుల, పనిచేసే ప్రతి ఒక్కరి ఆరోగ్య విషయంలో పూర్తిగా శ్రద్ధ వహించి ముందుకు వెళ్లాలని వివరించారు. ఇటువంటి చక్కటి చికిత్సశిబిరాలను ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయ హెల్త్ సెంటర్ ఉద్యో గులను ఆయన అభినందించారు. విశ్వ విద్యాలయ డీన్ అకాడమిక్ అఫైర్స్ ప్రొ.రజనీకాంత్ శుక్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ఆరోగ్య సమస్యలు పరిచించుకోవా లని సూచించారు. ఇన్చార్జి రిజిస్టర్ ప్రొఫెసర్ ఆర్జే రమాశ్రీ మాట్లాడుతూ ఇటువంటి ఆరోగ్య శిబిరాలను విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు, ఉద్యో గులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. దీనిద్వారా విద్యార్థులు ఉద్యోగులు సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ.దక్షిణామూర్తి శర్మ మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా ఈ శిబిరానికి వచ్చి కంటి, చర్మ సంబంధిత సమస్యలను వైద్యులచే పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు సూచనలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య సంయోజకలుగా విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్ ఇన్చార్జ్ డాక్టర్ బి బాల దత్తాత్రేయ వ్యవహరించారు. హెల్త్‌సెంటర్‌లోని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, సిబ్బంది విక్టర్ బాబు, ఖేమ్ రాజ్ మీనా, సాయిచంద్, ప్రశాంతి, డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ స్టాఫ్ మెంబర్స్ అలోక్ వర్మ, బి.దోరవేలు, పిఆర్వో జయ చంద్ర, డాక్టర్ యుగంధర్, స్కిన్ లేజర్ క్లినిక్ డాక్టర్ గౌతమి, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, రిసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.



## జీవో 117ను వెంటనే రద్దు చేయాలి

**ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి**

**ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ డిమాండ్ చేశారు**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** విద్యావ్యవస్థను చిన్నా భిన్నం చేసిన జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయా లని ఏపీటీఎఫ్ 257జిల్లా అధ్యక్షులు గోపీ నాథ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడి వెంక టేశ్వరరావుకు ఏపీటీఎఫ్ నాయకులతో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. వారు ప్రాథ మికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌ల ద్వారా విద్యాభ్యాసం అందించాలని, ప్రాథ మిక పాఠశాలలలో ఐదవ తరగతి వరకు మాత్రమే విద్యార్థులకు విద్యాభ్యాసం అందించాలని, ఉపా ధ్యాయులకు యాప్ లాభారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు మాత్రమే అమ్మకు వందనం పథకాన్ని వర్తింపచేయాలని, ఉపాధ్యాయుల సర్వీసులను డీఎస్సీ ద్వారా క్రమబద్ధీకరించా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్, ఏపీటీఎఫ్ నాయకులు అమర్నాథ్, మధు, రూటా అధ్యక్షులు మునీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## తిరుమల శ్రీవారి ఆరాధన విధానానికి మూలం వైఖానస భగవత్ శాస్త్రం

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆరాధన విధానానికి మూలం వైఖానసమహర్షి రచించిన వైఖానస భగవత్ శాస్త్రమని తిరుమల వైఖానస ట్రస్ట్ అధ్యక్షులు రాఘవ దీక్షితులు పేర్కొన్నారు. తిరుమల ఆస్థాన మండపంలో వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ మరియు టిటిడి ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం మరీచి మహర్షి తిరు నక్షత్రోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి అధ్యక్షత వహించిన రాఘవదీక్షితులు మాట్లాడుతూ, వైఖానస భగవత్ శాస్త్రం వేదంతో కూడినదని దేవాలయ సంస్కృతికి మూలమైన వేదమంత్రాలతో జరిపే వైఖానస ఆరాధన తిరుమల శ్రీవారికి అత్యంత ప్రీతి పాత్రమైనదని చెప్పారు. వేల సంవత్సరాలు గా శ్రీవారికి పూజలు ఉత్సవాలు వైఖానస ఆగమం ప్రకారం జరుగుతున్నాయని, ఈ ఆగమ శాస్త్రాన్ని మరిచి మహర్షి విమా నార్చన కల్పం, ఆనంద సహిత గ్రంథాలలో విధివిధానాలతో సమగ్రంగా వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సనత్ కుమార్ ప్రసంగిస్తూ, మరీచి మహర్షి అందించిన శాస్త్ర గ్రంథాలపై పరి శోధనలు జరిపి, అందులోని ఆగమ శాస్త్ర ప్రాధాన్యతను, సమాజ హితాన్ని వెలుగులోకి తీసుకురావాలన్నారు. దేవాలయ, మండపాల నిర్మాణాలను, నిత్య పూజలు, ఆరాధనలు విధివిధానాలు వంటి ఎన్నో శాస్త్ర విషయా లను సమగ్రంగా అందించారని చెప్పారు. దేవాలయ నిర్మాణమే సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడుతుందని వివ రించారు.ఎస్వి వేద విశ్వవిద్యాలయం ఆగమ శాస్త్ర ఆచార్యులు భవనారాయణాచార్యులు మాట్లాడుతూ, మరీచి మహర్షి ఉపదేశించిన విషయాలు, కల్పసూత్రాల ఆధారంగా రూపొందించబడ్డాయని చెప్పారు.

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్స వాలు వైఖానస భగవత్ శాస్త్రంలో చెప్పబడిం దని ఈ ఉత్సవ నిర్వ హణ, సందర్శన వల్ల భక్తులకు అశ్వమేధ యాగం చేసిన ఫలం లభిస్తుందని తెలిపారు. తరతరాలుగా బృహత్తరమైన ఈ శాస్త్ర ఆచ రణలో వైఖానస అర్చక సమాజం బృహత్తర బాధ్యత పోషిస్తుందన్నారు. వైఖానస ట్రస్టీ శ్రవణ్ కుమార్ ప్రసంగిస్తూ, భారతీయ సంస్కృతికి మూలం వేదాలు, ఆగమ శాస్త్రాలని, సమాజంలోని మానవాళిని ధర్మం మార్గంలో నడిపిస్తున్నాయన్నారు. మరీచి మహర్షి అందించిన దేవాలయ సంస్కృతి మహోన్న తమైందని వివరించారు. అనంతరం వైఖానస ట్రస్ట్‌కార్యదర్శి ప్రభాకర్ ఆచార్యులు ప్రసంగిస్తూ దేవాలయాల విశిష్టత, అర్చన, పూజ విధానాలను వివరించారు. అంతకు ముందు ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం అధ్యాపకు లు, విద్యార్థులు స్తోత్ర పఠనంతో మంగళ నిరాజనంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టుఅధికారి పురుషోత్తం, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంట్రల్ పనులు పూర్తి చేయాలి

### : కమిషనర్ అదితిసింగ్



**తిరుపతి నగరం, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలో ఏర్పాటు చేయనున్న ట్రాఫిక్ సిగ్నల్స్, సిసి కెమెరాల కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ పనులను పూర్తి చేయాలని, నగరంలో ఎక్కడెక్కడ అధునాత ట్రాఫిక్ సిగ్నల్స్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలో ఒక సమగ్ర నివేదికను తయారు చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి అదితిసింగ్ అన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ఐట్రీపుల్ సి లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు చేయాల్సిన పనుల గురించి తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల నిర్వాహణ భాగస్వామ్యులతో స్మార్ట్ సిటీ ఎండి అదితిసింగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరు గురించి ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ వారు, ఐ ట్రీపుల్ సి క్రాంటాక్టింగ్ ఏజెన్సీ వారు వివరాలను తెలియపరచడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఐ ట్రీపుల్ సి ప్రాజెక్ట్ పనులను ప్రారంభించాలని, కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుతో నగరంలో ఏర్పాటు చేయబోయే సిసి కెమెరాల పని తీరుతో మరింత మెరుగు ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి పోలీస్ ఏఎస్పి కులశేఖర్, ట్రాఫిక్ డిఎస్పి రమణ కుమార్, టెలీకామ్ జి.ఎం వెంకోబరావు, ఎపిఎస్పిడిసిల్ ఎస్.ఇ సురేంద్ర నాయుడు, మునిసిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటి జిఎం చంద్రమౌళి, ఏయికామ్ ప్రతినిధి భాలాజీ, మేనేజర్ చిట్టిబాబు, ఎన్ఈసి, పిఎంసి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇసుక పంపిణీలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి

### - జేసీ ధ్యాన్ చంద్‌కు విన్నవించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**సత్యవేడు, మేజర్‌న్యూస్:** ఉచిత ఇసుక పంపిణీలో సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. గురువారం సుబ్బానాయుడు కండ్రిక ఇసుక రీచ్ పరిశీలనకు వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్ చంద్‌ను ఎమ్మెల్యే కలుసుకొని ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుబ్బానాయుడు కండ్రిగ రీచ్‌లో నాణ్యమైన ఇసుక ఉన్నందువల్ల డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు.సత్యవేడు నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణం, సత్యవేడు నియోజకవర్గం లోని ప్రజల గృహ నిర్మాణం వంటి అవసరాలకు మొదటగా ఇసుక పంపిణీ చేయాలని ఎమ్మెల్యే,జేసికి వివరించారు. ఆ తర్వాత మాత్రమే సుదూర ప్రాంతాలకు ఇసుక సరఫరా చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు.నియోజకవర్గ ప్రజలు సైతం ఇసుక కొరత లేకుండా తమ నిర్మాణాలకు కావలసిన ఇసుకను తోలుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాష్ట్రానికే ఆదర్శంగా కుప్పం ఆర్టీసీ డిపో

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం ఆర్టీసీ డిపోను రాష్ట్రానికే మోడల్ డిపోగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆర్టీసీ 73వ వ్యవస్థాపక దినోత్సవాలను గురువారం కుంభ ఆర్టీసీ డిపో పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. కుప్పం ఆర్టీసీ డిపోను మోడల్ డిపోగా తయారు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అతి త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు డిపో అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారు.



## గిట్టుబాటు ధరలకు కందిపప్పు. బియ్యం పంపిణీ

### - ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** స్థానిక అయ్యప్ప జనరల్ స్టోర్‌లో గిట్టుబాటు ధరలతో ప్రజలకు నిత్యావసరాల సరుకులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజల సమస్యలను అడుగడుగున తెలుసుకొని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పి, అఖండ మెజార్టీతో గెలుపొందిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాము అధికారంలో వచ్చిన ఒక నెల రోజుల్లోనే ప్రజల సమస్యల పరిష్కారానికి సూపర్ సిక్స్ పథకాలతో ప్రజా రంజికంగా పరిపాలన చేస్తూ ప్రజల వద్ద మనలను పొందుతూ,ప్రజలపై విపరీతంగా ఉన్న నిత్యవసర సరుకుల భారాన్ని తగ్గించే విధంగా నేడు నిత్యావసర సరుకులు బియ్యం. కందిపప్పును పౌర సరఫరా శాఖ ద్వారా అందుబాటులో తీసుకొని వచ్చి 60 రూపాయల అమ్ముతున్న నాణ్యమైన బియ్యాన్ని 45 రూపాయలు. 200 రూపాయలు అమ్ముతున్న కందిపప్పు 160 రూపాయలకు ప్రజలకు అందుబాటులో తీసుకొని రావడం హర్షించదగ్గ విషయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు, ఈ నాణ్యమైన సరుకుల్లో ఎటువంటి లోపం ఉన్న సంబంధిత అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేస్తే ఆ షాపు లైసెన్స్ క్యాన్సిల్ చేసే విధంగా కార్యాచరణ చేపడతామని తెలియజేశారు, ఆగస్టు 15 నాటికి అన్న క్యాంటీన్ అందుబాటులో తీసుకుని వచ్చి ప్రజలకు రెండు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించే విధంగా కార్యచరణ చేపడుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.



కందిపప్పు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జలసుధీర్ రెడ్డి

## నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**సత్యవేడు, మేజర్ న్యూస్:** నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకే నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కొనేటి ఆదిమూలం అన్నారు.గురువారం నాడు సత్యవేడు నేతాజీ రోడ్డు లోని బిబిఎస్ లాడ్జి ప్రాంగణంకు ఎమ్మెల్యే చేరుకొని ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను ప్రభుత్వం నిర్దేశించిన ధర కేజీ పచ్చి బియ్యం రూ.48, స్టీమ్డ్ బియ్యం రూ.49 మరియు కందిపప్పు రూ.160కు పంపిణీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో కేజీ కందిపప్పు ధర రూ.200లు అమ్ముతున్నారన్నారు. ఈ ధరల పెరుగుదల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు నిత్యావసర వస్తువులు కొనలేక, ఏమి తినలేక పస్తులు ఉండే పరిస్థితి తలెత్తిందన్నారు.ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్టాల్‌ను ఏర్పాటు చేసి నాణ్యమైన దేశావాళి కందిపప్పు కేజీ రూ.160లకు, నాణ్యమైన పచ్చి బియ్యం కేజీ రూ.48, స్టీమ్డ్ బియ్యం కేజీ రూ. 49లకు అందిస్తుందన్నారు.రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో గురువారం నిత్యవసర వస్తువుల స్టాళ్లను ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యేల ద్వారా ప్రారంభోత్సవం చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. రాష్ట్రంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.





## మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని..

**తిరుపతి రూరల్, మేజర్ న్యూస్:** పాకాల మండలం పాకాల పంచాయతీ గాంధీనగర్ గుట్ట కింద ఇల్లు, బాలాజీ కాలనీ, శివాజీ నగర్, శ్రీనివాస్ నగర్, తదితర ప్రాంతాల్లో చంద్రగిరి ఎమ్మెల్యే ఎలక్షన్ కు ముందు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించి పొగతోటి నుండి దాదాపుగా రెండు కిలోమీటర్లు మేర పైప్ లైన్ నిర్మాణానికి గురువారం స్థానిక నాయకులు పూజలు నిర్వహించడం జరిగింది.

## తాగునీటి వృథా...
## చోద్యం చూస్తున్న పంచాయతీ సిబ్బంది

**రేణిగుంట, మేజర్ న్యూస్:** గ్రామపంచాయతీ పరిధిలోని తాగునీటి కష్టాల అష్ట కష్టాలుగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. రేణిగుంట గ్రామపంచాయతీ పరిధిలో ఒక్కో వీధికి సుమారు 15 నుండి 20 రోజులపాటు నీరు రాక తీవ్రష్ట కష్టాలు పడుతున్న తరుణంలో పట్టణ పరిధిలోని భుగ్గ వీధి ప్రాంతంలో వీధి కులాయి నందు వృధాగా తాగునీరు పోతున్న పట్టించుకోని పంచాయతీ సిబ్బంది. గతంలో రేణిగుంట పంచాయతీ పరిధిలో జరిగిన గ్రామసభలో పంచాయతీ ప్రజల సమస్యలలో ప్రధానంగా పోరాడినది తాగునీటి కష్టాలు తీర్చాలని ప్రజలు అధికారులను పంచాయతీ సర్పంచ్‌నూ గ్రామ సభలో నిలదీసినప్పటికీ అప్పుడు మాత్రం తూతు మంత్రంగా తాగునీటి కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏదో ఒక రూపంలో వీధి కులాయి నందు తాగునీరు విడుదల చేసినప్పటికీ వదిన మీరు రోడ్డుపాలు నేల పాలవుతున్నాయి తప్ప, ప్రజల దాహం తీర్చిన దాఖలాలు లేకుండా పోతున్నాయి. ఎక్కడైనా పంచాయతీ సిబ్బంది చెరువు తీసుకొని వీధుల్లో ఏర్పాటు చేసిన వీధి కులాలకు సరైన మరమ్మతులు చేపట్టి కుళాయిలు బిగించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.





# భక్తులతో డ్రైవర్స్ ఆప్యాయంగా మెలగాలి

## - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** శ్రీవారి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి తిరుపతికి విచ్చేసే యాత్రికులతో డ్రైవర్లు తమ కుటుంబ సభ్యులుగా భావించి వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి ఆప్యాయంగా మెలగాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శరవణ భవన్ వద్ద గరుడవారధి జీప్ అండ్ ఆటో యూనియన్, బాలాజీ సరోవర్ ట్యాక్సీ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని టాక్సీ జీప్ స్టాండులను ఆరంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ ప్రమాదాలకు తావు ఇవ్వకుండా యాత్రికులను సురక్షితంగా వారి గమ్యాలకు చేర్చాలని, యాత్రికలతో మర్యాదగా డ్రైవర్స్ వ్యవహరిస్తే తిరుపతికి మంచి పేరు వస్తుందని, లేకుంటే చెడ్డ పేరు వస్తాదన్నారు. యాత్రికులతోనే కాకుండా పెద్దకాపు లేవుట్ వాసులతో సఖ్యతగా మెలగాలని కోరారు. గతంలో కరుణాకర్ రెడ్డి తనకు డబ్బులు ఇవ్వ లేదని కక్షకట్టి పెద్దకాపు లేవుట్ వాసులకు రోడ్డు, డ్రైనేజీ సౌకర్యం కల్పించకుండా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. త్వరలో సుమారు 40 లక్షలతో పికె లేఅవుట్ సర్వీస్ రోడ్డు పనులను పూర్తి చేస్తామని చెప్పారు. సభ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, మహబూబ్ బాషా, జనార్ధన్, దొడ్డారెడ్డి రామకృష్ణా రెడ్డి, టాక్స్ జీప్స్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్,బాలాజీ సరోవర్ ట్యాక్సీ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఖాదర్ బాషా, హరి రాయల్, పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటు ధరలలో కందిపప్పు బియ్యం

## - జాయింట్ కలెక్టర్ హెచ్‌ఎం ధ్యాన చంద్ర

**తిరుపతిబ్యూరో మేజర్‌న్యూస్ :** ప్రజలకు అత్యవసరమైన కందిపప్పు, బియ్యం నిత్యవసరాలను అందుబాటు ధరలలో ప్రజలకు అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ హెచ్ ఎం ధ్యాన చంద్ర తెలిపారు. గురువారం రాయలచెరువు రోడ్డు రైతు బజార్ లో రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరలకు విక్రయించే కందిపప్పు, బియ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు అదుపులో



ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ధరలను తగ్గించి వినియో గదారులకు ఉపశమనం కలిగించటానికి ప్రభుత్వం హోల్ సేల్ కిరాణా మర్చెంట్స్ రైస్ మిల్లర్స్ ప్రతినిధులతో రాష్ట్రస్థాయిలో ఒక సమావేశం ఏర్పాటు చేసి నిత్యావసర సరుకుల ధరలు తగ్గించి విని యోగదారులకు అందించే విధంగా ఒప్పందం కుదుర్చుకుంద న్నారు. ఈ ఒప్పందంలో భాగంగా జిల్లాలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హోల్ సేల్ కిరాణా మర్చెంట్స్ అసోసియేషన్, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో దాదాపు 16 కౌంటర్లను ఏర్పాటు చేసామన్నారు. అందులో తిరుపతి, గూడూరు లోని రెండు రైతు బజారు కౌంటర్లతో పాటు ఏర్పాటు చేశామని, సదరు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 16 కౌంటర్ల ద్వారా దాదాపు 593 మంది లబ్ది దారులకు 1516 కిలోల బియ్యం, 1002 కిలోల కందిపప్పు అమ్మడం జరిగిందని, కేజీ కందిపప్పు ధర మార్కెట్ లో కిలో రూ.181 ఉండగా రూ.160 కు అమ్మడం జరుగుతోందని, స్టీమ్డ్ రైస్ మార్కెట్ ధర రూ.56 ఉండగా రూ.49 కి అమ్మడం జరుగుతోందని, పచ్చి బియ్యం మార్కెట్ ధర రూ.53 ఉండగా రైతు బజార్లలో రూ.48 అమ్మడం జరుతోందని, వినియోగ దారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే సంబంధిత నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే లు, ఎంపీ లు వారి పరిధిలో ప్రజలకు అవసరమయ్యే కందిపప్పు బియ్యం అమ్మకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్ పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి డా.యస్. వెంకటరత్నం శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో పుష్ప గుచ్చాలని అందించి మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా రాస్ అమలు చేసే వివిధ సేవా కార్యక్రమాలను సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకుని అభినందించారు. అనంతరం సంస్థ చేపడుతున్న కార్యక్రమాల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలను అందించాలని వెంకటరత్నం కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చంద్రబాబు నాయుడు రాస్ ప్రగతికి సేవా కార్యక్రమాలకు కానీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# నాయుడుపేటలో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి

## - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

**నాయుడుపేట మేజర్ న్యూస్:** పట్టణంలోని మెకానిక్ వృత్తిదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని త్వరలో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని సూళ్లూరుపేట నియోజకవర్గం శాసన సభ్యురాలు నెలవల విజయ్ శ్రీ హామీ ఇచ్చారు. నాయుడుపేట మెకానిక్ లు గురువారం నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ గౌరవ అధ్యక్షుడిగా నూతన అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని వాటికి ఎన్నికలు నిర్వహించుకుని, 786 రఫీ, నెలవల రాజేష్ ల ఆధ్వర్యంలో పట్టణ పురవీధులలో ర్యాలీగా సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాజీ ఏఎంసీ చైర్మన్ ఛేటీ విజయభాస్కర్ రెడ్డి లను కలుసుకొని వారికి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా నెలవల విజయశ్రీ మాట్లాడుతూ గత పాలకులు నాయుడుపేటలో ఆటోనగర్ ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని తాను మాత్రం నాయుడుపేట మెకానిక్ ల కష్టాలను గుర్తించి ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# వైకాపా నేతలకు శిక్ష తప్పదు : ఎమ్మెల్యే ఆరణి

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలపై దౌర్జన్యం చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శిక్ష అనుభవించక తప్పదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హెచ్చరించారు. డివిజన్ స్థాయిలో ఎవరెవరు కూటమి నేతలను ఇబ్బంది పెట్టారో వాళ్లను గుర్తించాలని జనసేన, తెలుగుదేశం, బీజేపి నాయకులను కోరారు. గురువారం 23,24,25,29 డివిజన్ల కృతజ్ఞతా సమావేశం వేశాలమ్మ ఆలయ సమీపంలో టిడిపి క్లస్టర్ ఇన్చార్జీ బుల్లెట్ రమణ ఆధ్వర్యంలో జరిగింది. అలాగే 30,31,36,37 డివిజన్ల సమావేశం టిడిపి క్లస్టర్ ఇన్చార్జీ దంపూరి భాస్కర్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. గత ఐదేళ్లు టిడిపి, జనసేన, బిజేపి నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యం చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులను ఎట్టి పరిస్థితుల్లోనూ కూటమి పార్టీల్లోకి చేర్చుకోరాదని మెజార్టీ టిడిపి నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. 30వ డివిజన్ లో అంగన్ వాడీ భవనం నిర్మించాలని, రజకుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న వీరభద్ర స్వామి ఆలయాన్ని పూర్తి చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకి విన్నవించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్డీఏ కూటమి నేతలను ఇబ్బందులకు గురి చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏ ఒక్క నాయకున్నీ ఎన్డీఏ పార్టీల్లోకి చేర్చుకోమని ఆయన స్పష్టం చేశారు. దౌర్జన్యాలకు పాల్పడని వాళ్ళు అవసరమనుకుంటూ పార్టీ బలోపేతం కోసం చేర్చుకుంటామని...అయితే డివిజన్ నాయకులను సంప్రదించాకే నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. తప్పు చేసిన వాళ్ళు శిక్ష అనుభవించక తప్పదని అంటూ దౌర్జన్యాలు, బెదిరింపులకు ఎన్డీఏ



కూటమి పార్టీలు దూరమన్నారు. జగన్మోహన్ రెడ్డి మరొక్కసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతిపాలవుతుందని ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారని చెప్పారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా జగన్మోహన్ రెడ్డి మార్చారని విమర్శించారు. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి అరాచకాలను పంటిబిగువున భరించిన ప్రజలు ఆయన కుమారుడ్ని చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పారని తెలిపారు. అఖండ మెజార్టీ ఇచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, జే డబ్లూ విజయ్ కుమార్, చినబాబు,మహేష్ యాదవ్, విజయలక్ష్మీ, రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, ముక్కు సత్యవంతుడు, చుక్కల దాము, అజయ్ కుమార్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, వెంకట్ రాయల్, ఆముదాల వెంకటేష్, కట్టా జయరామ్, అశోక్ కుమార్, పోటుకూరి ఆనంద్ పాల్గొన్నారు.

# సామాన్య ప్రజలకు నిత్యావసరాల ధరలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు

## - ఎంపీ, దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే పులివర్తి నాని

**చంద్రగిరి, మేజర్‌న్యూస్ :** మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయలేని సామాన్య మధ్య తరగతి ప్రజలకు వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం. పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చేతుల మీదుగా ప్రారంభించారు. కందిపప్పు, బియ్యం ప్రజలకు అందుబాటు ధరలకు ఉండేలా ధరలను పేద, మధ్యతరగతి కుటుంబానికి అందుబాటులో తేవటానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తపన పడుతున్నారని చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు తెలిపారు. ఒప్పందం లో భాగంగా జిల్లలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హోల్సేల్ కిరాణా మర్చెంట్స్ అసోసియేషన్, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చంద్రగిరిలో సరసమైన ధరల కోసం స్వర్ణ సూపర్ మార్కెట్ ను ఎమ్మెల్యే పులివర్తి నాని ఎంచుకోవడం జరిగింది. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. అధిక ధరల నియంత్రణలో భాగంగా సూపర్ మార్కెట్‌లో ఎంపీ.. ఎమ్మెల్యే, తనిఖీ చేశారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రంగా ప్రభుత్వం స్వర్ణ సూపర్ మార్కెట్ కు అనుమతులు మంజూరు చేసింది. మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయలేని సామాన్య మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. కందిపప్పు ధర మార్కెట్ లో కిలో రూ.181 ఉండగా రూ.160 కు అమ్మడం జరుగుతోందని, స్టీమ్డ్ రైస్ మార్కెట్ ధర రూ.56 ఉండగా రూ.49 కి అమ్మడం జరుగుతోందని, పచ్చి బి





య్యం మార్కెట్ ధర రూ.53 ఉండగా రైతు బజార్లలో రూ.48 అమ్మడం జరుగుతోందని, వినియోగ దారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా చంద్రగిరి ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మల్లాంలో తాగునీటి సమస్యపై అధికారుల పరిశీలన



**చిట్టమూరు మేజర్‌న్యూస్:** మండలంలోని మల్లాం దళితవాడలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై స్థానికులు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేష్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల నుండి అందిన ఆదేశాల మేరకు గూడూరు డివిజన్ పంచాయతీ అధికారి పి వెంకటరమణ, మండల అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ ఎఈతో కలిసి గురువారం మల్లాం దళితవాడలో క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి, వివరాలు సేకరించారు.స్థానికులతో కలిసి సమావేశాన్ని నిర్వహించి, ఉప్పు నీటితో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న కాలనీ వాసులకు వెంటనే పరిష్కారం చూపాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ కు సూచించినట్లు ఓ ప్రకటనలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మనోహర్ గౌడ్, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**గూడూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో, మాలవ్యానగర్‌లో ఉన్న మునిసిపల్ ప్రాథమిక పాఠశాల (జానకిరామ్ పేట) స్కూల్లో, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. 20సంవత్సరాలు ఉపాధ్యాయురాలుగా పనిచేసిన సుశీలమ్మ జ్ఞాపకర్థం, ఆమె భర్త ఐనబచ్చుల గోపాల్ రెడ్డి దాతృత్వంతో 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న పిల్లలు కు, నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్‌లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం దాత గోపాల్ రెడ్డి తెలుగుదేశం పార్టీ, తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచు రామయ్య, స్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయమ్మ, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

## క్రోనోకార్పస్ మొక్కలు తొలగించాలి



**గూడూరు, మేజర్‌న్యూస్:** పర్యావరణ పరిరక్షణ తోపాటు ప్రజల ఆరోగ్యం కోసం పట్టణ పరిధిలో డివైడర్ల మధ్యలో ఉన్న క్రోనో కార్పస్ మొక్కలు తొలగించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్ర శేఖర్ రావు కోరారు. గురువారం పురపాలక సంఘం కమిషనర్‌ను కలసిన చంద్రశేఖర్‌రావు క్రోనో కార్పస్ మొక్కల్ని తొలగించాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మొక్కల వలన ఉపయోగం కన్నా నష్టాలు ఎక్కువ ఉన్నాయని మన దేశంలో కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఈ మొక్కలను నిషేధించడం కూడా జరిగిందన్నారు. క్రోనో కార్పోస్ మొక్కలు మానవ మనుగడకు పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. క్రోనో కార్పస్ మొక్కల వలన పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి మానవ మనుగడకు ప్రమాదకరంగా మారుతుందని పర్యావరణవేత్తలు, వృక్ష శాస్త్రవేత్తలు తేల్చారని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** పుడమి తల్లి పరిరక్షణకు పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను నిర్వర్తించాలని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. నాయుడుపేట పట్టణంలోని నారాయణ హైస్కూల్ వారు గురువారం చేపట్టిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పూర్వికులు అందించిన స్వచ్ఛమైన నీరు, గాలి, నేల లను యథావిధిగా ముందు తరాలకు అందించాలన్నారు. పరిశుభ్రత,పచ్చదనంతో కూడిన ఆరోగ్యంవంతమైన సమాజం కోసం కొనరంకితమవ్వాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలను చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన నోటు పుస్తకాలు, బ్యాగు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్స రంలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధిం చిన విద్యార్థినిలను అధ్యాపకులను అభినందిం చారు. ఈ సంవత్సరం కూడా పదో తరగతి పరీక్ష ల్లో వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి దేవి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

## అధిక జనాభా పెరుగుదల సవాళ్ళను అధిరోహించాలి



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తిరుమల తిరుపతి దేవస్థాన నిర్వహణ శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభా వలన ఎన్నో సవాళ్లు ఎదురౌతున్నాయని, ప్రధానంగా సహజ వనరులు, మౌలిక సదుపాయాల కల్పన, పర్యావరణం పై ప్రభావం చూపుతోందని,ఈ సంవత్సర ప్రాధాన్యత నేపథ్య అంశం "అందరిని లెక్కించండి ఎవ్వరిని వదలొద్దు" ఉద్దేశం జనాభా గణాంకాలు జనాభా వృద్ధి సమస్యలను అర్థం చేసుకొని పరిష్కారాలు కనుగొని ప్రణాళికాబద్ధంగా పురోగతి సాధించడానికి తోడ్పడుతుందని, పెరుగుతున్న జనాభా సవాళ్ళను, అవకాశాలను అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమములో కళాశాల భౌగోళిక శాస్త్ర అధ్యాపకురాలు డి. అనురాధ మాట్లాడుతూ, ప్రపంచములోనే అత్యధిక జనాభా, యువత కలిగిన భారత దేశం, విద్య, ప్రపంచస్థాయి నైపుణ్యాలు వారిలో పెంచితే, యువభారత సమగ్రాభివృద్ధి సాధ్యమౌతుందని, అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. సి.ఎల్. చెన్నా రెడ్డి,డా. వి. ప్రసన్న లక్ష్మీ, వై. మహేశ్వరయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు ఎంపీకి టీడీపీ నేతల సన్మానం

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తలారి ముని కృష్ణ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ సెల్ కార్య నిర్వాహ కార్యదర్శి గోవిందరాజులు చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమల్ల ప్రసాదరావును ఘనంగా సన్మానం చేశారు.





## పది ఉతీర్ణులకు సన్మానం

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండలంలోని సుద్దగుండ్ల పల్లి గ్రామంలో పదవ తరగతిలో ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులను గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఈ విద్యా సంవత్సరంలో సుద్దగుండ్ల పల్లి గ్రామంలో13 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కాగా 13మంది ఉతీర్ణత సాధించారు. దీంతో గ్రామ పెద్దలు, యువత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కలిసి ఉత్తీర్ణులైన విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాలువలు కప్పి, జాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్, పోతయ్య, గ్రామ యువ నాయకుడు మంజునాథ మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకొని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గ్రామపంచాయతీ సర్పంచ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం కొనసాగించి గ్రామంలోని విద్యార్థులను చదువు వైపుగా ప్రోత్సాహిస్తామని తెలియజేశారు. తల్లి దండ్రులు మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా పిల్లల చదువులు మధ్యలో బడిఆపి వేయమని వారి విద్యా పరమైనా కోరికలు నెరవేర్చడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకొస్తామని ప్రతిజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతమ్మ వెంకాటాచలపతి(చిన్నబ్బన్న), రామక్రిష్ణ, జయప్ప, మనోహర, రమేష్, గంగిరెడ్డి, మల్లిఖార్జున, అంజప్ప, సుబ్రహ్మణ్య, సుబ్బిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశులు, పోతయ్య , అంగనవాడీ టీచర్ మోహనమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మామిడిలో రైతులకు అవగాహన



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మామిడి కాయలు కోసిన వెంటనే మామిడి చెట్లు ఎక్కువ కొమ్మలను కత్తిరింపుల ప్రక్రియను చేప ట్టాలని హార్టికల్చర్ అధికారి వర ప్రసాద్ తెలిపారు. మామిడిలో పూత 4-5 నెలలల్లో కొమ్మల మీద వస్తుంది కాబట్టీ పూత వచ్చే కొమ్మలను చివరి బాగం కత్తిరించాలన్నారు. పెరిగిన, ఎండు కొమ్మలను తొలగించాలని దీనిద్వారా మామిడి చెట్లకు ఎండ, గాలి కింద కొమ్మలకు తగలడానికి వీలుగా ఉంటుందన్నారు. మామిడి చెట్లల్లో అడ్డ దిడ్డంగా పెరిగే కొమ్మలను తీసేయాలనీ కూడా ఆయన తెలిపారు. కోసి వేయబడిన కొమ్మలకు తెగులు రాకుండా సిఓసి పేస్ట్ ను రాయాలని అదే విధంగ సిఓసి 3 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి చెట్టు మొత్తం తడిచే విధంగా పిచికారి చేయాలని రైతులకు సూచించారు.దీని వలన మామిడిని ఎక్కువగా ఆశించే తేనె మంచు పురుగులను, తెగుళ్లని అదుపు చేయవచ్చని కూడా ఆయన తెలిపారు.

## ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావం దినోత్సవం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి ఏపీఎస్ఆర్‌టిసి డిపో ఆవరణంలో ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి యూనియన్ గౌరవాధ్యక్షులు దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా విచ్చేసి యూనియన్ జెండాను ఆవిష్కరించారు. 73వ ఆవిర్భావ దినోత్సవ కేకులు కట్ చేసి యూనియన్ నాయకులకు కార్మికులకు పంచారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు అంజూరు శ్రీనివాసులు ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులకు ఉద్యోగులకు ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఆది నుంచి ఆర్టీసీ ఉద్యోగ కార్మిక పక్షాన ఎంప్లాయిస్ యూనియన్ రాజీలేని పోరాటం చేసి ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు వచ్చిన యూనియన్ నాయకులు ఉద్యోగ కార్మిక పక్షాన నిలుస్తూ సుదీర్ఘకాలం యూనియన్ ని కాపాడుకున్నారన్నారనీ ప్రశంసించారు. గతంలో రాజకీయ ఒత్తిళ్లతో యూనియన్ కు దూరమైన వారు కూడా తిరిగి యూనియన్ లోకి రావాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు పిఎస్ కుమార్ మాట్లాడుతూ ఎల్లవేళలా కార్మికుల పక్షాన పోరాడేది ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి ఎస్ కుమార్ జిపిఎస్ ఆచారి, రోశయ్య, మురళి, రమేష్, ప్రసాద్, ఎం ఎం రత్నం, కత్తి రవి తదితరులు పాల్గొన్నారు.



## నారాయణ పాఠశాలలో ఘనంగా క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం

**కుప్పం, మేజర్ న్యూస్:** కుప్పం నారాయణ పాఠశాలలో గత శనివారం జూలై 6 వ తేదిన పాఠశాల స్థాయిలో విద్యార్థులకూ హెడ్ భాయ్, హెడ్ గర్ల్, డివై హెడ్ భాయ్, డివై హెడ్ గర్ల్, జూ హెడ్ భాయ్, జూ హెడ్ గర్ల్ ఎన్నికలను ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ ఓట్ల లెక్కింపు అనంతరం విజేతులైన విద్యార్థుల చేత ఏజీఎం పణి కుమార్, కుప్పం కౌన్సిలర్ సురేష్ కుమార్, పాఠశాల భవన యజమాని యశ్వంత్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు జిల్లా నారాయణ పాఠశాల ఏజీఎం ఫణి కుమార్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండీ విద్యార్థులకు మంచి అవకాశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఏ.జి.ఎం బాలకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్, ఏడి ప్రదీప్ ఏఓ నరేష్ ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ గుణసుందరి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## క్వారీ వివరాలు తెలియజేయండి



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** క్వారీ వివరాలను తెలియజేయాలంటూ వెదురు కుప్పం తెలుగుదేశం పార్టీ నాయకులు క్వారీ యజమానులను కోరారు. గురువారం మండలంలోని ఎర్ర గుంట సమీపంలో ఉన్న ఓ క్వారీని తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. యజమాని నుండి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లోకనాథ్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రారెడ్డి, పచ్చికాపలం క్లస్టర్ ఇంచార్జ్ చంగల్రాయిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామానికి వెళ్లే దారి మూసివేత



దారికి అడ్డంగా రాళ్లు, ఇనుప కమ్మీలు ఉంచిన దృశ్యం

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని పాత గుంట పంచాయతీ చెన్నుగారి పల్లి నుండి గుట్టమీద ఇండ్లకు వెళ్లే దారిని కొంతమంది మూసివేసినట్లు గ్రామస్తులు మండల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి వెళ్లే దారిలో కొంత మంది ఇనుప కమ్మీలు, రాళ్లు తోలడంతో గ్రామానికి దారి సమస్య ఏర్పడినట్లు బాధితులు వివరించారు. దారి సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని వారు తహశీల్దార్‌కు, మండల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రేణిగుంట సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలో 2021 పంచాయతీ ఎన్నికలల్లో వైసిపి సైకో ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నాయకత్వంలో నామినేషన్ చించి వేస్తున్న సందర్భంగా ప్రజాస్వామ్యబద్ధంగా అడ్డుకోవడానికి ప్రయత్నం చేసిన అప్పటి తెలుగుదేశం పార్టీ నాయకులపై సీఐ శివకుమార్ రెడ్డి అక్రమ కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మొదటి వాయిదాకి శ్రీకాళహస్తి కోర్టుకు హాజరైన రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి. పార్టీ సీనియర్ నాయకులు కే శివశంకర్ రెడ్డి. నాయకులు పి నాగరాజు నాయుడు. కేకే రమణ. పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష. ప్రసాద్. వినోద్. హరి తదితరులు పాల్గొన్నారు.



కోర్టు వద్ద శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ నాయకులు

## బాల్య వివాహాలు వద్దు - బడి బాటే ముద్దు



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** బాల్య వివాహాల వల్ల బాలికల బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని ప్రతి బాలిక బడి బాట పట్టాలని డీ.ఎం. పురం ఉన్నతపాఠశాల ఇన్చార్జి హెచ్.ఎం సరస్వతి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం కత్తిరి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారుఈ సందర్భంగా వైద్యాధికారి భువనేశ్వరి సీ.హెచ్.ఓ పవిత్ర మాట్లాడుతూ గ్రామాల్లో బాలికలకు తొందరగా పెళ్ళిచేయడం వల్ల కలిగే కష్ట నష్టాలను గురించి వివరించారు.ప్రభుత్వం బాలికలకు కల్పిస్తున్న పథకాలను ఉపయోగించుకుని బాగా ఉన్నత చదువులు చదువుకోవాలని ఎలాంటి సమస్యలున్నా తమకు తెలియజేయాలని సూచించారు.జనాభా పెరుగుదల నష్టాలపై డీ.ఎం.పురం విలేజ్ క్లినిక్ సిబ్బంది శిరీష, అశ్విని, మోహన, లీల వివిధ ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తూ విద్యార్థులకు అవగాహన కార్వేటినగరం మండలం కల్పించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల రాజు, సాంఘీక శాస్త్ర ఉపాద్యాయులు హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాపిడ్ ఆటో కెప్టన్స్‌కు బహుమతులు




**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** రాపిడో ప్లాట్ఫారమ్ ద్వారా ఆదావనరులను పెంచడంతో ఉత్తమ సేవలు అందిస్తున్న రాపిడ్ ఆటో కెప్టన్స్ ప్రకటించి అందజేశారు. స్థానిక ర్యాపిడో సంస్థ కార్యాలయంలో గురువారం బహుమతులు ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ర్యాపిడో ప్లాట్. ఫారమ్ ద్వారా ఆదాయాలను పెంచిన రాపిడ్ ఆటో కెప్టన్స్ మురళీకృష్ణ, శ్రీనివాస్, రామారావు, మహేంద్ర, రమేష్, వెంకటేష్, సునీల్, కుళ్లాయిస్వామి, లవకుమార బాలాంజనేయులు, సురేష్‌కు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ర్యాపిడో సంస్థ జోనల్ మేనేజర్ శ్రీనివాస రామగిరి, క్లస్టర్ మేనేజర్ చంద్రశేఖర్, విస్తరణ మేనేజర్ రాజీవ్, రాపిడో ఆటో కెప్టన్స్ హాజరయ్యారు.

## పారిశుద్ధ్య పనుల్లో భాగంగా వీధుల్లో శానిటైజింగ్



**బుచ్చినాయుడు కండ్రిగ మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలోని సచివాలయ పరిధిలో సెక్రటరీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల్లో మరియు పారిశుద్ధ్యం లోపించిన వీధుల్లో పారిశుద్ధ్య కార్మికులచే సానిటైజింగ్ చేపిచ్చడం జరిగింది. ఇప్పుడే మొదలైనటువంటి వర్షాలు దృష్టిలో ఉంచుకొని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరిగింది.

# సంస్కృతి వర్సిటీలో వివిధ పరిషత్తుల ప్రారంభోత్సవం



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** విద్యార్థులలోని వివిధ భాషల కౌశలాలను స్పీకింగ్ స్కిల్స్‌ను డెవలప్మెంట్ కోసం స్థాపించబడిన వివిధ పరిషత్తుల ప్రారంభోత్సవ గురువారం సంస్కృతి విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో ప్రారంభించారు. విద్యార్థులకు వివిధ భాషల్లో కౌశలాలను నేర్చుకోవడం కొరకు ప్రత్యేకించి వాగ్వర్ధిని పరిషత్ సంస్కృత భాషణం, అన్నమాచార్య కళాపరిషత్ తెలుగు భాషణం, తులసీదాస్ హిందీ పరిషత్ హిందీ భాషణం, మాక్స్ ముల్లర్ ఇంగ్లీష్ క్లబ్ ఆంగ్లభాష భాషణం, కళాపరిషత్ వివిధ కళలు సంగీతం కోసం ప్రారంభించినట్లు విసి జిఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత రాష్ట్రపతి పురస్కార గ్రహీత, సాహిత్య శాస్త్ర నిష్ణాతులు రిటైర్డ్ ప్రొ.కె. రామసూర్యనారాయణ పాల్గొని మాట్లాడారు. అభ్యసించే విద్యార్థులకు వివిధ భాషల్లో స్కిల్స్ డెవలప్ చేసుకోవడం కొరకు ఈ పరిషత్తులు స్థాపించడం జరిగిందన్నారు. అందువల్ల విద్యార్థులందరూ కూడా ఈ పరిషత్తుల ద్వారా నిర్వహించే పోటీల్లో పాల్గొని చక్కటి వాక్పటిమను సంపాదించుకోవాలని సూచించారు. అనంతరం సభాధ్యక్షులు వైస్ చాన్సలర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి వారం కూడా విద్యార్థులు వివిధ వక్తృత్వ పోటీల్లో భాగగ్రహణం చేసి తద్వారా వారి భాషణ కౌశలాన్ని అభివృద్ధి చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొ.దక్షిణామూర్తి శర్మ వివిధ పరిషత్ కోఆర్డినేటర్స్, అడిషనల్ కోఆర్డినేటర్స్, వాగ్వర్ధినీ పరిషత్ కోఆర్డినేటర్ డా.నాగరాజు, డా.ఉదయన హెగ్డే సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** శ్రీసాయి సుధా క్రాంతి ఆసుపత్రి, సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం తిలక్ రోడ్ లోని సాయి సుధా ఆసుపత్రి నందు గ్లూకోమా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 50 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారిలో గ్లకోమా అనే నీటి కాసుల వ్యాధి వస్తుందన్నారు. ఇలాంటప్పుడు రక్తంలో చెక్కర స్థాయిలు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. రెటీనా అనేది కంటి లోపల భాగంలో కాంతి సెన్సిటివ్ భాగం, డయాబెటిక్ రెటీనోపతి ప్రారంభ దశలో దృష్టి సాధారణంగా ప్రభావితం కాదన్నారు. రెటీనో పతి అభివృద్ధి చెందుతున్నప్పుడు దృష్టి ప్రభావితం కావచ్చుఅని, ఇలాంటి పరిస్థితిని చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేస్తే పూర్తిగా దృష్టిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. డయాబెటిస్ ఉన్నవారు ప్రతి 3 నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్లకోమా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నట్లయితే, గ్లకోమా బారిన పడకుండా, కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ శిబిరంలో హాస్పటల్ సిబ్బంది హిమబిందు, సునీత, మహేష్, నరేంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.





## డాక్టర్ వంశీకృష్ణకు యంగ్ పీడియాట్రిషన్ అవార్డు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** తిరుపతికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఏ.వంశీకృష్ణ యంగ్ పీడియాట్రిషన్ అవార్డును అందుకున్నారు. అంకుర మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ అందిస్తున్న వైద్య సేవలను గుర్తించిన ఏసియా టుడే మీడియా సంస్థ యంగ్ పీడియాట్రిషన్ ఆఫ్ ది ఇయర్ ఆంధ్ర ప్రదేశ్ అవార్డుతో పాటు ఫ్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు అందజేశారు. ఈ మేరకు గురువారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను డాక్టర్ వంశీకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్ వంశీకృష్ణను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదేళ్ల కల సాకారం

## ఎమ్మెల్యే పులివర్తికి బాలచంద్రారెడ్డి కృతజ్ఞతలు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** తిరుపతి రూరల్ మండలం తనపల్లి పంచాయతీ ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ వాసుల పదేళ్ల కల సాకారం చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలచంద్రా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో వేసిన బోరుకు ఆయన మోటర్ అమర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీ వాసులకు మంచి నీటిని సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో దామినేడు రమేష్, నాగార్జున, భూపాల్, మురహరి, రమణ, ఢిల్లి పాల్గొన్నారు.



## నాయుడుపేట మెకానిక్స్ అసోసియేషన్ ఎన్నిక



**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** నాయుడుపేట నూతన మెకానిక్స్ అసోసియేషన్ నియామకం గురువారం జరిగింది. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల మెకానిక్స్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, అధ్యక్షులుగా తిరుణామల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎస్డి ఆలీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ టిడిపి నేత నెలవల రాజేష్ లకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం,మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి లను కలసి ఆటోనగర్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మెకానిక్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి లకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెకానిక్స్ అసోసియేషన్ నాయకులు దశరద,నజీర్,రమేష్, ప్రసాద్,రవి తదితరులు పాల్గొన్నారు.

## డ్రమ్ సీడర్ పద్ధతిలో అధిక దిగుబడులు



**పెనుమూరు మేజర్‌న్యూస్:** వరి సాగులో డ్రమ్ సీడర్ పదవి ద్వారా పంట సాగు చేసే అధిక దిగుబడులు సాధించవచ్చు అని ఏరువాక శాస్త్రవేత్త తెలిపారు.చిత్తూరు జిల్లాలో వరి నాట్లు వీరి నేరుగా డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తడం ముమ్మరంగా చేపడుతున్వారు నాట పూర్తయినీ వం పొలాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. వరి,వేగుశనగలో కలుపు నివారణ చర్యలు చేపట్టానికి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పెనుమూరు మండలంలోని అట్లవారి పల్లి, సంగీత గోపన పల్లి, ఉగ్రాణం పల్లి గ్రామాల్లోని పంట పొలాలను సందర్శించి కలుపు నివారణ చర్యలను సూచించారు. కార్యక్రమంలో రెడ్డి రాము, పి. నాగమ్మరి గ్రామీణ వవసాయ అవికారి టి. డిప్లొ బాబు పాల్గొన్కారు.

# డయల్ యువర్ ఎమ్మెల్యేకు అనూహ్య స్పందన

ప్రతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

చిత్తూరును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తాం

సంక్షేమ అభివృద్ధితో ముందుకు వెళతాం

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే ప్రతి వారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం



**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, వీలైనంత ఎక్కువ సమస్యలు వచ్చే గురువారం లోపల పరిష్కరిస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. గురువారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. నగరపాలకతో పాటు, గుడిపాల, చిత్తూరు రూరల్ ప్రాంతాల నుంచి ప్రజలు ఫోన్ ద్వారా సమస్యలను ఎమ్మెల్యేకు వినిపించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్వయంగా విని నమోదు చేసుకోవడంతో పాటు సావధానంగా సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ డా. జె అరుణ, మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, సీఐ విశ్వనాథ రెడ్డి, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల అధికారులు, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనులు చేయండి....** డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చిత్తూరు నగరపాలక సంస్థ, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫోన్ ద్వారా అందిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సత్వరం క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. ప్రధానంగా నగర పాలక పరిధిలో డ్రైనేజీ కాలువలు, వీది లైట్లు, రోడ్లు,పారిశుద్ధ్యంపై ఎక్కువ ఫిర్యాదులు అందాయని.. వీటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్యం నిర్వహణ, ఇళ్ల నిర్మాణం, రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటుపై సంబంధిత అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మండల స్థాయిలో, పోలీసులు సంబంధించిన సమస్యలను సంబంధిత ఫిర్యాదుదారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కరించడం, అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడ రాజీ పడవద్దన్నారు. ప్రజలకు మంచి పనులు చేయడం, సమస్యలను పరిష్కరిస్తాం అనే భరోసా ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు మంచి పేరు తేవాలన్నారు. ఇదే సమయంలో నగరపాలక పరిధిలో అభివృద్ధి పనుల కోసం నిధుల కొరత ఉందని, నగరవాసులు పన్నులు సకాలంలో చెల్లించడం ద్వారా అభివృద్ధి పనులు వేగవంతం చేయవచ్చని, ఇందుకోసం నగరవాసులు సహకరించాలని పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలో వెనకబాటుతనాన్ని పోగొట్టి, అభివృద్ధి పథంలో నడిపించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని, నగరాన్ని స్మార్ట్‌సిటీగా రూపొందించడంలో భాగంగా పురపాలకశాఖ మంత్రి నారాయణని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి అదనపు నిధులు సాధిస్తానని చెప్పారు.



## శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర సహాయ మంత్రి

**తిరుమల, మేజర్‌న్యూస్:** శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషం ఉందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దేశంలోని తెలుగు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించాను. దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ నిత్యం పేదప్రజల గురించి ఆలోచించే వ్యక్తి నరేంద్ర మోడీ. కార్యకర్తలకు బిజెపిలో ఎప్పటికైనా సముచిత స్థానం లబిస్తుంది. ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రస్తుతం టిటిడి నడుస్తోంది. దేవుడ్మి నమ్మని వారు, పేరుకు నామాలు పెట్టి స్వామి ఆస్తులకే పంగనామాలు పెట్టిన నయవంచకులు గత ప్రభుత్వంలో టిటిడిలో ఉన్నతాధికారులుగా ఉన్నారు. కానీ ఎన్డీయే ప్రభుత్వంలో నిత్యం స్వామివారిని స్మరించే అధికారులు వచ్చారు. రాజకీయ నిరుద్యోగులకు పునరావాస కేంద్రంగా గత ప్రభుత్వం టిటిడిని మార్చివేసింది.



గత ప్రభుత్వంలో ఇతర మతస్తులకు టిటిడిలో అధికారాన్ని అప్పగించారు. తిరుమలలో శ్రీవారి ఆస్తులను వైసిపి నేతలు కొల్లగొట్టారు. ఎర్రచందనం పేరుతో స్మగ్లింగ్‌కు వైసిపి నేతలు పాల్పడ్డారు. బిజెపి నేతలు ఎప్పుడూ ఏ మతాన్ని, వ్యక్తులను కింద పరిచే వ్యాఖ్యలు చేయరు. గత ప్రభుత్వంలో అవినీతి చేసిన వారిని వదిలిపెట్టేది లేదు. గత ప్రభుత్వంలో ఎర్ర చందనం స్మగ్లింగ్ అక్రమ రవాణా, శ్రీవారి నిధులను దోచుకున్న వారిపై విచారణ జరిపిస్తాం. కేంద్ర హెూం శాఖా మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్తాం.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**తిరుమల, మేజర్‌న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి వారిని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళి మోహన్ దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మొదటి సారి మండల టీడీపీ నాయకులతో కలసి స్వామి వారి దర్శనానికి వచ్చారు. ముందుగా స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. గురువారం ఉదయం విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళి మోహన్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి., పూతలపట్టు నేను ఎమ్మెల్యేగా అనంతరం శ్రీవారికి మొక్కులు సమర్పించుకున్నట్లు తెలిపారు. నారా చంద్రబాబు., పవన్., మోదీ సంయుక్తంగా అందించే సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందేలా స్వామి ప్రసాదించాలని ప్రార్థించానన్నారు. ప్రతిపక్ష హెూదా లేని పార్టీలు ప్రభుత్వంతో కలసి వచ్చి అభివృద్ధి., సంక్షేమంకు సహకరించాలని కోరారు. ఉపాధి కల్పన కోసం పరిశ్రమలు తీసుకు రావాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియజేశారు. ఐటీ క్యారిడార్ ఇక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఐటీ శాఖామంత్రి లోకేష్‌ను కోరామన్నారు. సానుకూలంగా స్పందించి అందుకు తగిన ప్రపోజల్స్ ఇవ్వాలని సూచించారని స్పష్టం చేశారు. తిరుమల తరహాలో శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మంచి మాస్టర్ ప్లాన్స్ రూపొందించి మెరుగైన సౌకర్యాలు అందిస్తామన్నారు. మామిడి రైతులకు న్యాయం చేకూరేలా చేస్తామని హామీ ఇచ్చారు. పాడైన రోడ్లకు మరమత్తులు నిర్వహిస్తామని అన్నారు. పూతలపట్టును కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.



# శ్రీవారి దర్శన క్యూలైన్లలో ప్రాంక్ వీడియోలు... టీటీడీ సీరియస్

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లలో ప్రాంక్ వీడియోలు కలకలం రేపాయి. దర్శన క్యూలైన్లలో కొందరు ఆకతాయిలు ప్రాంక్ వీడియోలు చిత్రికరించి వెకిలి చేష్టలకు పాల్పడ్డారు. తమిళనాడుకు చెందిన వివాదాస్పద యూట్యూబర్ టీటీఎఫ్ వాసన్ తన మిత్రులతో కలిసి దర్శనక్యూలైన్లలో ప్రాంక్ వీడియోలు చిత్రీకరించాడు. ఈ క్రమంలో నారాయణగిరి షెడ్‌లలో వేచి ఉన్న భక్తులతో తాళాలు తీస్తున్నట్లు నటించాడు. వాసన్‌ను చూసిన కంపార్ట్ మెంట్ లోని భక్తులు టీటీడీ ఉద్యోగి అనుకుని పైకి లేవడంతో టీటీఎఫ్ వాసన్ వెకిలి నవ్వులు నవ్వుతూ పరిగెడుతూ రావడాన్ని తన మిత్రులు చిత్రీకరించారు. ఈ వీడియోలను టీటీఎఫ్ ఫ్యామిలీ అనే తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పోస్ట్ చేయడంతో తమిళనాడులో వైరల్ గా మారింది. దర్శన క్యూలైన్లలో భక్తులతో ప్రాంక్ వీడియోల చిత్రీకరణపై తమిళనాడులో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఆకతాయి చేష్టలు చేసిన వాసన్ ను అరెస్ట్ చేయాలని పలువురు భక్తులు సోషియల్ మీడియాలో డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై టీటీడీ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. భక్తుల మనోభావాలు దెబ్బ తీసేలా ప్రాంక్ వీడియోలు తీయడం హేయ మైన చర్య అని టీటీడీ ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రాంక్ వీడియోలు చిత్రికరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. తిరుమల శ్రీవారి సర్వదర్శనం క్యూలైన్‌లో దర్శనానికి వెళ్తూ కొందరు తమిళ యూట్యూబర్లు భక్తుల మనోభావాలు దెబ్బ తినేలా తీసిన ప్రాంక్ వీడియో హేయ మైన చర్య అని టీటీడీ తీవ్రంగా ఖండించింది. సాధారణంగా నారాయణగిరి షెడ్స్ దాటి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ప్రవేశించక ముందే భక్తుల నుండి మొబైల్స్ డిపాజిట్ చేయడం జరుగుతుందని టీటీడీ చెప్పింది. నిత్యం భక్తుల గోవింద నామాలతో మారుమ్రోగే తిరుమల కంపార్ట్మెంట్లలో, వారి మధ్యనే ఉండి ఒకరిద్దరు ఆకాతాయిలు చేసిన ఈ వికృత చేష్టలతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని టీటీడీ ప్రకటనలో పేర్కొంది. ఇటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని టీటీడీ హెచ్చరించింది.




జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

## కొల్లాగుంట సచివాలయానికి చిత్రపటాలు బహూకరణ



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండ లంలోని కొల్లాగుంట గ్రామ సచివాలయం నందు ముఖ్యమంత్రి వర్యులు నా రాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంతి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను అందజేస్తున్న సచివాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అభ్యర్థి జయచంద్ర, పవనకుమార్, తులసిరామన్ కేశవులు చెట్టి గణేష్ సుమన్, కొల్లాగుంట గ్రామ ప్రజలు సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం బాలాజీ కాలనీ వద్ద వెలిసిన సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం, సాయి వ్రతం, కుంకుమార్చనలు,అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం దర్శించిన భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు లతా బాలాజీ, ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు రాంశెట్టి రాజశేఖర్, ఉప కోశాధికారి చిరంజీవి రెడ్డి, కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులను సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో లావణ్య పాత్ర కీలకం



**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** డిగ్రీ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి వారు ఉన్నత లక్ష్యాలకు దోహదం చేయడంలో కంప్యూటర్స్ గెస్ట్ అధ్యాపకురాలు లావణ్య పాత్ర కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులు రెడ్డి తెలిపారు. గురువారం అతిథి అధ్యాపకురాలు లావణ్య కళాశాల నుండి బదిలీ సందర్భంగా కళాశాల బృందం ఆమెకు వీడ్కోలు పలుకుతూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అతిథి అధ్యయపకురాలుగా ఉన్నప్పటికీ కళాశాల న్యాక్ సమయంలో, అలాగే విద్యార్థులను ఉన్నత లక్ష్యాల దిశగా తీసుకెళ్లడానికి సాంకేతిక పరిజ్ఞానం అందించారని గుర్తు చేశారు. అలాగే ప్రతి సంవత్సరం ఆమె పేరుమీద, ఆమె ప్రోత్సాహంతో ప్రతి ఏడాది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు గుర్తు చేశారు.ఈ సందర్భంగా కంప్యూటర్స్ అతిధి అధ్యాపకురాలు లావణ్య మాట్లాడుతూ కళాశాలలో ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించి నా ఉన్నతికి కృషి చేశారని వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బొజ్జల బృందమ్మ జన్మదిన సందర్భంగా అన్నదానం



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం దగ్గర బొజ్జల బృంద మ్మ జన్మదిన సందర్భంగా 9 వవార్డు యూత్ మైనారిటీ నాయకుడు జావీద్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి కేక్ కట్ చేసి అన్న దానం స్వీట్‌లు పేద ప్రజలకు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్ నాయుడు. రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి. షాకిర్ అలీ. క్లస్టర్ ఇంచార్జ్ కంటా రమేష్.పట్టణ మైనార్టీ అధ్యక్షులు. షఫీ. కోపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఖాదర్ బాషా. వెంకటేష్ చౌదరి.రామచంద్రయ్య. మాజీ కౌన్సిలర్ గిరి, మీర్జా చాన్ భాష, మీర్జావాలి, మహిళా అధ్యక్షురాలు సుమతి, కుమారి, నయేమా, ఆజాద్, నవీన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు ఆర్థికసాయం



**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్:** గూ దూరు పట్టణం 1వ వార్డ్ లో "పరమాల వెంకటయ్య" మరణ వార్త తెలిసిన వెంటనే దహనసంస్కార ఖర్చుల నిమిత్తం రూ.3000ల ఆర్థిక సహాయం స్థానిక ఎమ్మెల్యే పాసింజర్ కుమార్ 26 బూత్ ఇన్చార్జి అడపాల శివకుమార్, అడపాల రాము, చేతుల మీదుగా అందజేశారు.

## సిపిఐ సభను జయప్రదం చేయండి

**శ్రీకాళహస్తి రూరల్, మేజర్‌న్యూస్:** రూరల్ మండలం సమితి సమావేశం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో తొండు మల్లికార్జున అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన పార్టీ కార్యాలయంలో సిపిఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం జరుగుతుందన్నారు నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు భూ బకాసురులు విచ్చల విడిగా ఆక్రమించి స్థానికేతరులకు అమ్మి ప్రభుత్వ భూములను కొల్లగొట్టడం జరిగిందన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలు సాగు చేయడానికి సెంటు భూమి లేక నాన్న ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. నిజమైన లబ్ధిదారులకు ఇంటీ స్థలాలు లేక ఒక ఇంటిలోనే మూడు కుటుంబాల వారు జీవనం గడుపుతున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మించల శివకుమార్ నాయకులు రాజయ్య, మనీ, శివ, సుబ్రహ్మణ్యం, గాయత్రి, సాంబయ్య, భక్తవశులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో వేద సదస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల


వేద పాఠశాల ప్రారంభంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తిలో దక్షిణ భారతదేశ వేద మహాసభ ప్రారంభమైంది. వేద పాఠశాలలో వేద విద్య అభ్యసించే విద్యార్థులు గురువులు వేద పండితులతో వేద సదస్సు ఏర్పాటు చేశారు. శ్రీ జనార్ధన సరస్వతి వేద విద్యాన్ మహా 15 వసభలును ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి జ్యోతి ప్రజ్వాలను చేసి ప్రారంభించారు. నాలుగు రోజులు పాటు వేద సదస్సు నిర్వహిస్తారు. సకలలోక క్రియా వేదం నుంచి పుట్టిందని వేదం ద్వారానే భారతదేశం జగద్గురువుగా ఆర్భవించిందని వేద ట్రస్ట్ అధ్యక్షులు సాయినాధ శర్మ అన్నారు. శ్రీకాళహస్తిలో శ్రీ జనార్ధన సరస్వతి వేద విద్యాన్ మహాసభ ప్రారంభించారు. 15వ మహాసభలు శ్రీకాళహస్తిలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ మహాసభలలో దక్షిణ భారతదేశంలోని వేద పాఠశాలల్లో వేదవిద్యనభ్యసించే వేద విద్యార్థులు వేద గురువులు, వేద పండితులు మహాసభకు విచ్చేసి గత 12 ఏళ్లుగా వేద విద్య అభ్యసించిన విద్యార్థులకు వేద పరీక్షలు నిర్వహించి చివరి రోజు సర్టిఫికెట్లు ప్రధానం చేయనున్నారు. ఈ వేద మహాసభను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభింపజేశారు. పుణ్యప్రాంతమైన శ్రీకాళహస్తి వేదాలకు నిలయమని పరమేశ్వరి సన్నిధిలో వేద పండితులు సమ్మేళన జరగడం ఈ ప్రాంతానికి ఉన్న విశిష్టత అద్దం పట్టింది అన్నారు. శ్రీ జనార్ధన సరస్వతి వేద మహాసభల ట్రస్ట్ అధ్యక్షులు సాయినాథ్ శర్మ, రాయలసీమ జోన్ కార్యనిర్వాహకులు మారుతి శర్మ మాట్లాడుతూ వేదం అనేది శివ తత్వం నుంచి పుట్టిన దేవుడి భాష అన్నారు. సకల జీవ ప్రక్రియకు మూలం వేదమని వేదం మూలంగానే సకల కర్మలు జరుగుతున్నట్లు తెలిపారు. భారతదేశం జగద్గురువుగా వేదం మూలంగా ఆర్భవించింది అన్నారు. శ్రీకాళహస్తిలో జరిగే నాలుగు రోజుల సదస్సులో వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్లు ప్రధానం చేస్తారని తద్వారా వారి జీవన ఉపాధి అవకాశాలు పొందేందుకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్ వి ఎస్ మూర్తి, దక్షిణ భారత వేద పండితులు పాల్గొన్నారు.

# డిజిటల్ అసిస్టెంట్లను జేఏలుగా నియమించండి



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వారి యొక్క విద్యా అర్హతనుబట్టి జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో డిజిటల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న సిబ్బంది గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తామస్ ను అతని స్వగృహంలో వినతి పత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా డిజిటల్ అసిస్టెంట్లు మాట్లాడుతూ గ్రామ వార్డులు సచివాలయంలో వివిధ డిపార్ట్మెంట్లుగా 2019లో పంచాయతీ కార్యదర్శులుగాను డిజిటల్ అసిస్టెంట్లు కాను దరఖాస్తు చేసుకోవడానికి గ్రాడ్యుయేషన్ కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు ఉండాలని ఉండాలని అంక్షలుతో దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఇందులో బీటెక్ ,ఎంటెక్ , ఎంసీఏ, అలాగే 20 శాతం మంది పీహెచ్డీ చేసిన వారున్నారు. మాకు అత్యధికంగా సాఫ్ట్వేర్ లో ఇంజనీర్లు అదేవిధంగా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులుగా పనిచేసేవారు వారు తెలిపారు. ఎంత ఉన్నత విద్యను ఉన్నవారికి డిజిటల్ అసిస్టెంట్ గా గత ప్రభుత్వ నియమించింది.

ఆ పేస్ కేలిచి అన్యాయం జరిగిందన్నారు. గత ప్రభుత్వ డిజిటల్ అసిస్టెంట్ గా టైటిల్ ఇచ్చి మా పోస్ట్ కు సర్టిఫికెట్ జాబ్ ఛార్జ్ ఇచ్చినప్పటికీ మమ్మల్ని అనేక డిపార్ట్మెంట్ అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు కార్యాలయంలో జిరాక్స్ ఆపరేటర్లుగాను భావిస్తున్నారు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో వీఆర్ఓ లాగిన్ లో డిజిటల్ అసిస్టెంట్గా పని చేయలేదని. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని ఆయనకు వినతిపత్రం చేశారు ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# వాడ వాడలా బొజ్జల బృందమ్మ జన్మదినం వేడుకలు

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి, ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ 72వ జన్మదినం సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణం కుమారస్వామి తిప్ప వద్ద అన్నదాన కార్యక్రమం శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, పచ్చురు వివేక్ గౌడ్, సీను, రాకేష్, శరవణ కుమార్, మహేష్,నవీన్, ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది, అన్నదాన కార్యక్రమానికి శాసన సభ్యుల సతీమణి బొజ్జల రిషితా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బొజ్జల రిషితా రెడ్డి మాట్లాడుతూ బృందమ్మ ప్రధానమైనటువంటి సమస్యలను గుర్తించి, చొరవ తీసుకొని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న అక్రమాలు అవినీతి స్థానిక ప్రభుత్వ వైద్యశాల నందు రోగులకు మెరుగైన వైద్యం, ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూలంకుశంగా వారి సమస్యలను తెలుసుకొని యుద్ధప్రాతిపధికన గౌరవ శాసన సభ్యుల దృష్టికి తీసుకెళ్తూ సమస్యలను పరిష్కరించు కోవడంలో బృందమ్మ అనుభవాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించడం జరిగింది, ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు వాకచర్ల గుర్రప్ప శెట్టి, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ నారాయణ, టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బాలు ఢిల్లీ బాబు, జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని భాష, పట్టణ కార్యనిర్వ కార్యదర్శి వజ్రం కిషోర్, కటికం సుబ్రహ్మణ్యం, పురుషోత్తం నాయుడు, జనసేన నాయకులు మాధవ మహేష్, కంఠా సుబ్రహ్మణ్యం, మందల సుబ్రహ్మణ్యం, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుమతి, పట్టణ మహిళ ప్రధాన కార్యదర్శి కుమారి, సంజాకుల మురళి, దావాల ధనంజయులు, కరీం, అస్మత్, మస్తాన్, మారం శివ, సంజాకుల మురళి, మాజీ కౌన్సిలర్ గిరిధర్,ధారా పాండు, మధు, వెంకటరమణ, మణి, ఊహ, జయశ్రీ, ఈశ్వరి, దివ్య, షేక్ నీలు, తదితరులు పాల్గొన్నారు.

